ప్రాణాలు తీస్తున్న అతి వేగం



స్టీల్‌ప్లాంట్ రహదారి ప్రమాద దృశ్యం (ఫైల్)


- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న యువత

ఉక్కునగరం: చిన్నపాటి నిర్లక్ష్యం నిండు ప్రాణాలను బలిగొంటుంది. వాహనాలు నడిపేటప్పుడు తమకు ఏమీ కాదనే నిర్లక్ష్యంతో అతి వేగంగా ప్రయాణించడం ద్వారా ఎంతో మంది ప్రమాదాల్లో ఇరుక్కుంటున్నారు. ఇటీవల జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే ఎక్కువగా అతి వేగంగా వాహనాలు నడపడం వల్ల జరిగినవే. తద్వారా అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. జరిగిన రోడ్డు ప్రమాదాలను పరిశీలిస్తే అవి కూడా ఎక్కువ సీసీ కలిగిన వాహనాలు వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్ల జరిగినవే. ఈ విధంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో యువత ఎక్కువగా ప్రాణాలు కోల్పోతుండటం గమనార్హం. బుధవారం స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఒక ప్రమాదంలో ఇద్దరు యువకులు దుర్మరణం చెందగా మరొక ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. గత ఏడాది స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ సెక్టార్–10 మలుపు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో గంగవరానికి చెందిన ముగ్గురు యువకులు మృతి చెందారు. అదే విధంగా ఉక్కునగరం డీపాల్ పాఠశాల వద్ద ద్విచక్ర వాహనాన్ని ఫార్మాసిటీకి చెందిన బస్సు ఢీకొట్టిన సంఘటనలో ఓ విద్యార్థి దుర్మరణం పాలయ్యాడు. స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద ఉక్కు అధికారి కుమారుడు మద్యం సేవించి కారును వేగంగా నడిపి ద్విచక్ర వాహన చోదకుడిని ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. అదే విధంగా స్టీల్‌ప్లాంట్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల సమీపంలో ఇద్దరు యువకులు వేగంగా వాహనం నడిపి చెట్టును ఢీకొట్టిన సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. పై ప్రమాదాలను పరిశీలిస్తే నిర్లక్ష్యంతో కూడిన అతి వేగం వల్లే ప్రమాదాలు జరిగినట్లు వెల్లడవుతోంది. ట్రాఫిక్ పోలీసులు నిత్యం రహదారి ప్రమాదాలపై అనేక కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కళాశాలల్లో యువతకు అవగాహన తరగతులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ ప్రమాదాలు పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. ఒక వయసుకు వచ్చిన తర్వాత యువత తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి వాహనాలు కొనిపించుకుంటున్నారు. ఈ విషయంలో యువత తల్లిదండ్రులను బ్లాక్‌మెయిల్ చేసిన సంఘటనలు కూడా ఉంటున్నాయి. వారు కోరిన బైక్‌లు కూడా మామూలు 100 సీసీ, 125 సీసీ కాకుండా 350 సీసీ, ఆపై సామర్థ్యం కలిగి కనీసం రెండున్నర లక్షల వ్యయంతో కొనిపించుకునేవే ఎక్కువగా ఉంటున్నాయి. తల్లిదండ్రులు ఎంతో కష్టపడి కొనిస్తుండగా వాటి సామర్థ్యానికి అనుగుణంగా నడపకపోతే పక్కవారి వద్ద చులకన అవుతామనే భావనతో అతి వేగానికి పోవడం అనర్థాలు తెస్తోంది. జాతీయ రహదారులపై నడపాల్సిన వేగం సాధారణ రహదారులపై నడపడం ద్వారా ప్రమాదాల సంఖ్య పెరుగుతుంది. ఈ విషయంలో తల్లిదండ్రుల పాత్రతో పాటు ట్రాఫిక్ విభాగం పాత్ర కూడా ఉందని చెప్పాలి. మితిమీరిన వేగంతో వెళ్లే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా వాహన చోదకుల్లో భయం కలిగించకపోతే ప్రమాదాల నివారణ మరింత క్లిష్టంగా మారుతుందనడంలో ఎటువంటి సందేహం లేదు.



స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన ప్రమాదంలో మృతి చెందిన యువకుడు (ఫైల్)

నిర్లక్ష్యం, అతి వేగం వల్లే ప్రమాదాలు..



యువత అతి వేగం వల్ల ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ప్రమాదాల వల్ల జరిగే పరిణామాలపై వారికి అవగాహన ఉండటం లేదు. లారీలు, బస్సుల వంటి భారీ వాహనాల డ్రైవర్ల నిర్లక్ష్య ధోరణి వల్ల మరో వైపు ప్రమాదాలు జరుగుతున్నాయి. సిగ్నల్ జంపింగ్, జిగ్ జాగ్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి కారణాలు ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. సీపీ ఆదేశాల మేరకు ఈ ప్రమాదాలపై స్పెషల్ డ్రైవ్ చేపట్టాం. రాత్రి 9 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాం. హెల్మెట్ లేని వారికి మూడు నెలలు లైసెన్స్ సస్పెండ్ చేస్తున్నాం.

– కె. వెంకటరావు, స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ సీఐ

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా క్యాలండర్ ఆవిష్కరిస్తున్న అతిథులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శనివాడలోని పీస్ అసోసియేషన్ సారథ్యంలో గురువారం ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రీస్ట్ నిబంధన సంఘం అధ్యక్షుడు రెవా డేవిడ్ రాయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. యేసు క్రీస్తు నేర్పిన ప్రేమ, దయ, కరుణ, సుగుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా 2025 నూతన సంవత్సర క్యాలండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో పి.ఎలీష, నాయకులు గవర సోమశేఖర్, కె.దోంేంద్ర, బి.సత్యనారాయణ, వెంకటరావు, సింహాచలం, సూర్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్ప స్వామి ఆలయంలో సుబ్రహ్మణ్య షష్ఠి

ఉక్కునగరం: స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం సుబ్రహ్మణ్య షష్ఠి నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు అయ్యప్ప ఆలయం నుంచి సెక్టార్–5 మరిడిమాంబ ఆలయం వరకు పాలకావిడి ఉత్సవం జరగనుంది. అక్కడి నుంచి కావిడి ఉత్సవం శివాలయం మీదుగా తిరిగి అయప్ప ఆలయానికి చేరుకుంటుంది. అనంతరం అష్టాభిషేకం, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందని ఆలయ ప్రధానార్చకులు నాగేశ్వరశర్మ తెలిపారు.

క్లుప్తంగా

కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దీనబంధు

పెదగంట్యాడ: కనీస పింఛన్ రూ.9 వేలు ఇవ్వాలని ఆల్ పెన్షన్ పర్సన్స్, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దీనబంధు డిమాండ్ చేశారు. పెదగంట్యాడ సీబ్ల్యూసీ వద్ద కణితి అప్పలరాజు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సదుపాయం, రైల్వే టికెట్లలో 50 శాతం రాయితీ కల్పించాలని, రైస్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో గురప్ప, వెంకటరావు, పెంటారావు, అప్పారావు, సోమునాయుడు, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

తీరైన ఆహారంతోనే మెరుగైన ఆరోగ్యం

అగనంపూడి: మనం తీసుకునే ఆహారంపై మన ఆరోగ్యం ఆధారపడి ఉంటుందని న్యూట్రిషనిస్ట్ గాయిత్రి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో పౌష్టికాహారం, ఆహార శాస్త్రం అనే అంశంపై రెండురోజుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్సిటీ, విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, సింబయాసిస్ టెక్నాలజీ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మంచి ఆహారపు అలవాట్లను అలవర్చుకోవాలని, ఆహార నియమాలతో పాటు సమయపాలన పాటించాలన్నారు. మనం తీసుకునే ఆహారంలో అన్ని రకాల పోషకాలు ఉంటే శరీరంతో పాటు కండరాలు, ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, కోఆర్డినేటర్ బి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.


నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: స్థానిక నిర్వాసిత కాలనీలకు చెందిన రెండు నిరుపేద కుటుంబాలకు సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ నెలకు సరిపడా నిత్యావసర సరకులు అందించింది. అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం సందర్భంగా సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వీటిని పంపిణీ చేసింది. 25 కిలోల బియ్యం, పప్పులు, పంచదార, చింతపండు, నూనెలు, ఇతర నిత్యావసర వస్తువులు అందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు గుదే సుశీలా గజేంద్రరావు, పట్టా రామ అప్పారావు, ఎం.మస్తాన్‌రెడ్డి, శీరంశెట్టి గోవిందరావు, పొన్నగంటి కొండలరావు, లక్కరాజు రాము, పిళ్లా శ్రీనివాస్, బొండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్‌లో స్వచ్ఛతా ర్యాలీ




ఎన్‌ఎస్‌టీఎల్ వద్ద ర్యాలీలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, ఉద్యోగులు

గోపాలపట్నం: ఎన్‌ఎస్‌టీఎల్‌లో గురువారం స్వచ్ఛతా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా గృహ సముదాయాల ప్రాంతంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ బ్రహం వర్గీస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు వాడకూడదని, క్లాత్ బ్యాగులు వినియోగించాలని సూచించారు. పర్యావరణ హితంగా అందరం మసలుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్యశ్రీనివాస్, లెఫ్టినెంట్ కల్నల్ రాహుల్ దీక్షిత్, శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కిడ్నీలో భారీ రాయి తొలగింపు



యూరాలజిస్ట్ అభిరామ్‌తో చికిత్స చేయించుకున్న రోగి



తొలగించిన దుప్పికొమ్ము రాయి

అక్కిరెడ్డిపాలెం: దుప్పికొమ్ము రాళ్లు అనేవి కిడ్నీలలో ఏర్పడే భారీ పరిమాణంలో ఉండే రాళ్లు. ఇవి దాదాపు కిడ్నీ మొత్తం ఆవరించి ఉంటాయి. తద్వారా కిడ్నీల పనితీరును దెబ్బతీస్తాయి. దాని వల్ల తరుచు తీవ్రమైన ఇన్ఫెక్షన్లు వచ్చి మూత్రంలో రక్తం కనిపిస్తుంది. ఈ రాళ్లను పూర్తిగా తీసేయాల్సిందే. ఇలాంటి దుప్పికొమ్ము రాళ్లను తొలగించడం సంక్లిష్టం. విశాఖకు చెందిన 46 ఏళ్ల వ్యక్తికి ఏకంగా 5 సెంటీమీటర్ల పొడవు, 5 సెంటీమీటర్ల వెడల్పు ఉన్న పెద్ద దుప్పికొమ్ము రాయి ఏర్పడింది. ఎక్కడా సరిగా చికిత్స చేయకపోవడంతో కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి చెందిన కన్సల్టెంట్ యూరాలజిస్టు డాక్టర్ కె. అభిరామ్ వద్దకు వచ్చారు. ఇక్కడ తనిఖీ చేయగా మూత్రపిండం కేవలం 30 శాతం మాత్రమే పని చేస్తుంది. దాంతో లేప్రోస్కోపిక్ పద్ధతిలో ఒకే సిటింగ్‌లో మూత్రపిండాలకు ఎటువంటి నష్టం కలుగకుండా శస్త్రచికిత్స చేసి రాయిని తొలగించారు. రోగి కోలుకోవడంతో రెండవ రోజే అతడిని డిశ్చార్జి చేశారు.

రహదారులా.. డంపింగ్ యార్డులా?

- పెదగంట్యాడ ఆటోనగర్‌లో పేరుకుపోయిన వ్యర్థాలు
- నానా అవస్థలు పడుతున్న స్థానికులు



వాహనంలో తీసుకొచ్చి డెబ్రిస్ డంప్ చేస్తున్న దృశ్యం



రోడ్డు పక్కన డంప్ చేసిన డెబ్రిస్

పెదగంట్యాడ: పెదగంట్యాడ ఆటోనగర్ ప్రాంతంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యం.. గ్యారేజ్ నిర్వాహకుల బాధ్యతారాహిత్యం ఆటోనగర్‌కు శాపంగా మారాయి. దీంతో స్వచ్ఛత లక్ష్యం నీరు కారుతోంది. పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నా.. కొన్ని ప్రాంతాల్లో ఆ సమస్యకు నేటికీ పరిష్కారం దొరకడం లేదు. ఆయా చోట్ల విధులు నిర్వర్తిస్తున్న శానిటరీ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు ప్రధాన కారణమని స్థానికులు మండిపడుతున్నారు. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని యాతపాలెం వెళ్లే ప్రధాన రహదారి డంపింగ్ యార్డ్‌ను తలపిస్తోంది. డెబ్రిస్ తీసుకొచ్చి ఈ రోడ్డు పక్కన డంప్ చేస్తున్నారు. పట్ట పగలే ఇలా చెత్తా చెదారం, భవనాలకు చెందిన డెబ్రిస్‌ను విచ్చలవిడిగా పడేస్తున్నారు. అంతే కాకుండా ఇక్కడి ఆటోనగర్‌లో పలు పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలను కూడా ఇక్కడే పడేయడంతో ఈ రోడ్డు మొత్తం డెబ్రిస్, మట్టితో నిండిపోయింది. గుట్టలు గుట్టలుగా డెబ్రిస్ పేరుకుపోతున్నా.. అక్కడ డెబ్రిస్‌ను డంప్ చేస్తున్న వారిని అడ్డుకునే నాథుడే కరవయ్యాడని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటోనగర్‌లో సుమారు 250కి పైగా పరిశ్రమలు ఉన్నాయి. చుట్టుపక్కల అధిక సంఖ్యలో నివాసాలు ఉన్నాయి. ఇక్కడి నుంచి ప్రతిరోజు సుమారు 15 నుంచి 20 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. ఈ చెత్త నిత్యం శానిటరీ సిబ్బంది తరలించాల్సి ఉంది. అయితే ఆ దిశగా సంబంధిత యంత్రాంగం పర్యవేక్షించడం లేదని.. ఆ కారణంగా పరిశ్రమ నిర్వాహకులు కొంతమంది తీరు బాధ్యతారాహిత్యంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి రోజు తమ పరిశ్రమల నుంచి ఉత్పత్తి అయ్యే చెత్తను సమీపంలో పడేస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి తక్షణ చర్యలు చేపట్టాలని, అలాగే చెత్తా చెదారం తెచ్చి పడేస్తున్న వారిపై నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రెచ్చిపోతున్న మందుబాబులు

- లారీ డ్రైవర్‌పై తీవ్రంగా దాడి
- నలుగురు అరెస్టు.. వీరిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ కూడా..
- ఆందోళనలో డ్రైవర్లు



గాయపడిన లారీ డ్రైవర్ రఫీ



బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద ఆందోళన చేస్తున్న లారీ డ్రైవర్లు

సింథియా: మల్కాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో మందుబాబులు రోజురోజుకూ రెచ్చిపోతున్నారు. పూటుగా మద్యం సేవించి కనబడిన వారిపై దాడికి తెగబడుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు ఫిర్యాదు చేసిన పోలీసులు పట్టించుకోవడంలేదని బాధితులు వాపోతున్నారు. బుధవారం ఓ లారీ డ్రైవర్‌పై దాడికి దిగారు. యలమంచిలి ప్రాంతానికి చెందిన షేక్ రఫీ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం హెచ్‌పీసీఎల్ నుంచి 3 గంటల ప్రాంతంలో లారీలో బ్లాక్ ఆయిల్ లోడ్ చేసుకుని వస్తుండగా..కొంత దూరంలో డివైడర్‌పై త్రినాథపురం ప్రాంతానికి చెందిన ఎలక్ట్రీషియన్ తామడ బాలశంకర్, జై ఆంధ్రా కాలనీకి చెందిన పెయింటర్ భార లోకేష్ , ఏకేసీకాలనీకి చెందిన డెలివరీ బాయ్ దేవులపల్లి రాజేష్, విశాఖ సిటీ పరిధిలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ చెవ్వేటి నరేంద్రబాబు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. ఈ క్రమంలో తామడ బాలశంకర్ అకస్మాత్తుగా రోడ్డుపైకి వచ్చి లారీ కింద పడబోయాడు. డ్రైవర్ రఫీ అప్రమత్తమై లారీ ఆపి కిందకు దిగి శంకర్‌ను ప్రశ్నించగా..బాలశంకర్ అసభ్యపద జాలంతో దుర్భాషలాడాడు. ఇంతలో లోకేష్, నరేంద్రలు వెనుక నుంచి వచ్చి లారీ డ్రైవర్‌ను ముఖంపై దాడి చేశారు. దీంతో లారీ డ్రైవర్ రఫీకి కుడి కన్ను కింద తీవ్ర రక్తస్రావం అవడంతో పాటు ఎడమ కంటికి కూడా గాయమైంది. అనంతరం రాజేష్, నరేంద్రలు తల వెనుక భాగలో కర్రతో కొట్టి సమీపంలో ఉన్న పొదల్లోకి తోసేసి, సిమెంట్ రాయిని విసిరేశారు. దీంతో స్థానికులు గమనించి కేకలు వేయడంతో వారంతా అక్కడి నుంచి పారిపోయారు. తీవ్రంగా రఫీని తోటి డ్రైవర్లు గాజువాకలోని ఆర్కే హస్పటల్‌లో చేర్పించారు. గురువారం ఉదయం బ్లాక్ ఆయిల్ టెర్మినల్ వద్ద తమకు రక్షణ లేదంటూ, నిందితులను వెంటనే అరెస్టు చేయాలని లారీ డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మల్కాపురం పోలీసులు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

ఫెన్సింగ్ క్రీడలో బాలిక సత్తా



అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో బ్రాంజ్ మెండల్ సాధించిన ఆప్తి వర్ణిక

గోపాలపట్నం: అంతర్జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడలో బ్రాంజ్ మెడల్ సాధించిన సామర్లకోటకు చెందిన ఆప్తి వర్ణిక శేఖర్‌కు గురువారం విశాఖ విమానాశ్రయంలో కుటుంబ సభ్యులు ఆపాయ్యంగా స్వాగతం పలికారు. మలేషియాలో ఒలింపిక్ కౌన్సిల్ ఆఫ్ మలేషియా నిర్వహించిన ఈ పోటీల్లో అండర్–12 కేటగిరీలో వర్ణిక సత్తా చాటి కాంస్య పతకం సాధించింది. తమ కుమార్తె 5వ తరగతి చదువుతోందని, ఫెన్సింగ్ క్రీడలో రాణిస్తోందని బాలిక తల్లి తెలిపారు. కోచ్ రామకృష్ణ శిక్షణ వల్ల మెడల్ గెలిచానని వర్ణిక తెలిపింది. భారత్‌కు బ్రాంజ్ మెడల్ సాధించడం గర్వంగా ఉందని ఆనందం వ్యక్తం చేసింది.

నూతన ఆవిష్కరణలపై అవగాహన ముఖ్యం

విశాఖ విద్య: పరిశోధనా రంగంలో జరుగుతున్న నూతన ఆవిష్కరణలపై ఎప్పటికప్పుడు అవగాహన పొందాలని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. కెమిస్ట్రీ విభాగంలో గురువారం నానో మెటీరియల్స్ ఫర్ ఎనర్జీ, కెటాలసిస్ అండ్ ఎన్విరాన్మెంట్ జాతీయ సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పరిశోధనలు జరుగుతున్న నానో మెటీరియల్స్‌పై సదస్సు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వర్తమాన అంశాలను పరిశోధకులకు పరిచయం చేయడానికి, విద్యార్థులకు విస్తృత అవగాహన కల్పించడానికి ఈ సదస్సు దోహదపడుతుందన్నారు. ఈ రంగంలో నిష్ణాతులతో ప్రత్యేక ప్రసంగాలు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజ్ ఆచార్యుడు డాక్టర్ జి.రఘురామారావు నానో మెడిసిన్స్ అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల మాట్లాడుతూ మూడు రోజుల జాతీయ సదస్సులో ఏయూ కెమిస్ట్రీ విభాగంలో చదువుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో స్థిరపడిన పూర్వ విద్యార్థులందరినీ భాగం చేస్తూ వారినే వక్తలుగా ఆహ్వానించి ప్రత్యేక ప్రసంగాలలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడిటెక్ గ్లోబల్ యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ హెచ్.పురుషోత్తం, సదస్సు కన్వీనర్ ఆచార్య టి.శివరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు ఆచార్య వి.సిద్ధయ్య ఆచార్య కె.బసవయ్య, ఆచార్య శైలజ తదితరులు ప్రసంగించారు.

సీజీఎంకు వ్యతిరేకంగా ఆందోళన



దీక్ష శిబిరం వద్ద నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ సీజీఎం తమ విధానాలను మార్చుకోకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆల్ ఇండియ డిఫెన్స్ ఎంప్లాయిస్ ఫెడరషన్ నాయకులు హెచ్చరించారు. ఈ మేరకు గురువారం నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు సమీపంలో ఏర్పాటు చేసిన దీక్షాశిబిరం వద్ద విలేకర్లతో మాట్లాడారు. డిఫెన్స్ కోఆర్డినేటర్ కమిటీ చైర్మెన్ వెంకటరావు మాట్లాడుతూ కార్మికులు నెలకు 38 గంటల ఓటీని నమోదు చేస్తారని, అంత కంటే ఎక్కువ పని చేస్తే స్టోరేజ్ ఓటీగా నమోదు చేస్తారన్నారు. ఈ విధానం డాక్‌యార్డ్‌లో, ఎన్‌ఏడీలో 20 ఏళ్లుగా కొనసాగుతోందని వివరించారు. ఫ్యాక్టరీ చట్టం ప్రకారం ఇలా నమోదు చేయకూడదని కొత్తగా వచ్చిన సీజీఎం చెబుతుండడంతో సరికాదన్నారు. జీఎం, లేబర్ ఆఫీసర్ చెప్పినా సీజీఎం పట్టించుకోకుండా మొండిగా వ్యవహరిస్తున్నారన్నారు. గతంలో తమకు స్టోరేజ్ ఓటీ ఇచ్చేవారని అది కొనసాగించాలని కోరారు. ఎన్‌ఏడీ సీఈ యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఏవీ థామస్ మాట్లాడుతూ శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు విక్టమైజేషన్ వ్యతిరేక వారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 8న ఎన్‌ఏడీ నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తామని, శుక్రవారం ట్రేడ్ యూనియన్ నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీనివాసరావు, అధ్యక్షుడు నూక రాజు తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

సీతమ్మధార : ప్రజల సమస్యలు, భూ వివాదాల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని విశాఖ అర్బన్ తహసీల్దార్ ఎం.రమేష్ వెల్లడించారు. సీతమ్మధారలో గల కార్యాలయంలో ఆయన 'సాక్షి'తో గురువారం మాట్లాడారు. ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకు సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 6న రేసపువానిపాలెం రెవెన్యూ విలేజీ ప్రాంత ప్రజలకు తమ కార్యాలయంలో, 9న మద్దిలపాలెం ప్రాంత ప్రజలకు 109వ నంబర్ సచివాలయం, 11న పెదవాల్తేరు ప్రాంత ప్రజలకు 99వ నంబర్ సచివాలయం, 13న చినవాల్తేరు ప్రజలకు ఎంవీపీ కాలనీ లుంబినీపార్కు ఏరియాలోని కల్యాణ మండపంలో, 16న వెంకోజీపాలెం వాసులకు ఎంవీపీ కాలనీ నేతాజీపార్కులో గల 105వ నంబర్ సచివాలయంలో, 18న దొండపర్తి ప్రాంత ప్రజల కోసం అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో, 20న అల్లిపురం ఎక్స్‌టెన్సన్ వార్డు ప్రజలకు అక్కయ్యపాలెంలోని షాదీఖానాలో సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూ సమస్యలకు సంబంధించిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సదస్సుల్లో తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొంటారని, ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

స్టీల్‌ప్లాంట్ కార్మికుల గోడు వినాలి



మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

అగనంపూడి : స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించడం లేదని, సెయిల్‌లో విలీనం చేస్తామని ప్రధానమంత్రితో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటింపజేయాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కూర్మన్నపాలెం రిలే దీక్షా శిబిరం 1393వ రోజు కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉక్కు కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు, నిర్వాసితుల గోడు ముఖ్యమంత్రి వినాలని కోరారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉపాధి కల్పించే కర్మాగారాన్ని ప్రైవేటీకరించాలంటే రాష్ట్ర ప్రభుత్వం సహకారం అవసరమన్నారు. అలాగే విశాఖ ఉక్కు కోసం కేంద్రం అందించిన అప్పుతోపాటు, రూ.55 వేల కోట్లు వివిధ పన్నుల రూపంలో చెల్లించిదని... అలాంటప్పుడు కర్మాగారంపై కేంద్రానికి పెత్తనం ఎలా ఉంటుందని, ఈ విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం స్పందించాలని కోరారు. మూడేళ్ల వరకు లాభాల్లో నడిచిన కర్మాగారం ప్రైవేటీకరణ కోసం పన్నిన కుట్రల వల్లే నష్టాల్లో నడుస్తోందన్నారు. కార్యక్రమంలో యు.రామస్వామి, కారు రమణ, దాసరి శ్రీనివారావు, కొమ్ము ప్రసాద్, గోపాలరాజు, నాయుడు, మధు, ప్రభాకర్‌రెడ్డి, బాబూరావు, రవి పాల్గొన్నారు.